సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 18 । జూలై । 2025



కొత్త సబ్ స్టేషన్లకు..
జుక్కల్ నియోకవర్గంలో ఆరు కొత్త సబ్ స్టేష న్‌ల నిర్మాణానికి సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- 9లో ▸



బెంబేలెత్తిస్తున్న కుక్కలు, కోతులు
కోతులు, కుక్కలను చూసి జనాలు బెంబేలెత్తుతున్నారు. ఎల్లారెడ్డి శివార్లలో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.9 /24.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి ఒడ్డెన్న




లింగంపేట/భిక్కనూరు: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి ఒడ్డెన్న సూచించారు. లింగంపేట, భిక్కనూరు జూనియర్‌కళాశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలని సూచించారు. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం వివరాలపై ఆరా తీశారు. 90 శాతం ఉత్తీర్ణతతో లింగంపేట కళాశాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ నరేందర్ వివరించారు. కళాశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, సైన్స్, కామర్స్ సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో డిజిటల్ తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఆయనవెంట జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలామ్, ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు దుర్గయ్య, రాజయ్య, శివ, స్వామిగౌడ్, ధర్‌సింగ్, నాగు, అంజమ్మ, శ్రీలత, హైమద్, అంజయ్య, ఆనందర్‌రెడ్డి, నాగయ్యర జ్యోతిర్మయి రాధాబాయి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి



కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలను అరికట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో యాంటీ నార్కొటిక్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, కల్తీ కల్లు వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడిన వారిని గుర్తించాలన్నారు. మత్తుకు బానిసైన వారిని బయటికి తీసుకువచ్చేందుకు వైద్యారోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను సరఫరా చేసేవారిని గుర్తించి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. ఎస్పీ రాజేశ్‌చంద్ర, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీడబ్ల్యూవో ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం



భిక్కనూరు: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగంపల్లి కేజీబీవీ పాఠశాలలో టీచర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిమం టైంస్కేల్, కేర్‌టేకర్ నియామకం, సమ్మె కాలానికి వేతనం ఇప్పించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామన్నారు. అనంతరం టీచర్లకు యూనియన్ సభ్యత్వాన్ని అందజేశారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుషాల్, ప్రధానకార్యదర్శి పుట్ట శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గిరిధర్, అనిల్‌కుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారి హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన అతిథి!



పులి కథ వింటుంటే ఆ గంభీర వాతావరణం కళ్ల ముందు కదలాడుతుంది. అది వేటాడే తీరును వివరిస్తుంటే ఎనలేని ఆసక్తి ఉంటుంది. అటువంటి పెద్దపులి మన పక్కనే ఉన్న అడవుల్లో తిరుగుతోంది. నాలుగైదు దశాబ్దాల క్రితం ఉమ్మడి జిల్లాలోని అడవుల్లో పెద్ద పులులు సంచరించేవని చెబుతుంటారు. అయితే సుదీర్ఘకాలం తరువాత జిల్లాకు అరుదైన అతిథిగా 'పులి' రావడంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- నాలుగైదు దశాబ్దాల తరువాత కనిపించిన పెద్దపులి
- ఉమ్మడి జిల్లా సరిహద్దు అడవుల్లో కదలికలు
- ఇంతకాలం చిరుతలే తప్ప పులుల జాడ లేకుండే
- వారం రోజులుగా పులి సంచారంపైనే చర్చ..



సున్నపురాళ్ల తండాలో మైక్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్న గ్రామస్తులు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతమైన రామారెడ్డి, మాచారెడ్డి, సిరికొండ మండలాల పరిధిలో పులి సంచరిస్తోందని అటవీ శాఖ అధికారులు కచ్చితమైన నిర్ణయానికి వచ్చారు. దీంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది. సుదీర్ఘకాలం తరువాత జిల్లాకు అరుదైన అతిథిలా వచ్చిన 'పులి' కదలికలపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో దట్టమైన అడవులు ఉండడంతో నాలుగైదు దశాబ్దాల క్రితం వరకు పులులు ఉండేవని, విచ్చలవిడిగా చెట్లు నరకడం, పోడు సేద్యం కారణంగా అడవుల విస్తీర్ణం తగ్గడంతో ఆ తరువాత కనిపించకుండాపోయాయని చెబుతుంటారు. ఏళ్ల తరువాత పులి కనిపించడంతో ఈ అంశం హాట్‌టాపిక్ అయ్యింది. పులి జాడను కనిపెట్టి దాన్ని వేటగాళ్ల బారిన పడకుండా రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఎస్12 నంబరు పులి ఆచూకీ కోసం అటవీ ప్రాంతంలో మకాం వేసిన బృందాలు ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేసి మృగం కదలికలను ట్రాప్ చేయడంలో నిమగ్నమయ్యారు. మరోవైపు డ్రోన్ కెమెరాలతోనూ పులి జాడ కనిపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

జాడ కనిపెట్టారా?
ఎటు వైపు వెళ్లి ఉంటుంది..!?

ఉమ్మడి జిల్లాలో పులి సంచరిస్తుందన్న వార్తా కథనాలతో చాలా మంది పులి జాడ దొరికిందా ? ఎటువైపు వెళ్లింది? ఎవరి మీదైనా దాడి చేసిందా ? అనే విషయాల గురించి మాట్లాడుకుంటున్నారు. అటవీ అధికారులు, సిబ్బంది వారం రోజులుగా అడవుల్లో పులి ఆచూకీ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో పులి సంచారం గురించి విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో 'నాన్న పులి' అన్నట్టుగా రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో పులి వచ్చిందనే ప్రచారం గురువారం అర్ధరాత్రి జరిగింది. వచ్చింది పులి కాదు.. నక్క అని అటవీ అధికారులు చెబుతున్నారు.



రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో డప్పు చాటింపు వేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

కవ్వాల్ నుంచి కామారెడ్డి వైపు..

కవ్వాల్ ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాల మీదుగా తిరుగుతూ పులి (ఎస్12) నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతానికి చేరుకుంది. రెడ్డిపేట స్కూల్ తండా పరిధిలో ఆవుపై దాడి చేసిన ఘటన, ఆ తరువాత ఆవు కళేబరంపై విష ప్రయోగం చేసి పులిని చంపాలనే కొందరి ప్రయత్నాల నేపథ్యంలో చర్చ జోరందుకుంది. నాలుగైదు దశాబ్దాల తరువాత వచ్చిన పులిని అరుదైన అతిథిగా గుర్తిస్తున్నారు. పులి చరిత్ర తెలుసుకునేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో చిరుతల సంచారం ఎక్కువగానే ఉంది. వాటి సంతతి కూడా పెరుగుతోంది. ఇటీవలి కాలంలో పలు చోట్ల చిరుతలు ప్రమాదాల బారిన పడ్డాయి. ఒకటి రెండు చోట్ల వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యాయి. ఇతర రకాల వన్యప్రాణులు ఎన్నో ఉన్నా 'పులి' లేదనే లోటు ఇది వరకు ఉండేది.

తోడు కోసం వచ్చిందా..

సాధారణంగా పులి అది సంచరించే ప్రాంతాన్ని వదిలి ఇతర ప్రాంతాల్లో ఒంటరిగా తిరగుతోందంటే తోడు కోసం వెళ్లినట్టు భావిస్తారు. నాలుగు నుంచి ఐదు సంవత్సరాల వయస్సున్న ఎస్12 పులి కూడా ఆడ తోడు కోసం వివిధ ప్రాంతాల గుండా తిరుగుతూ ఈ ప్రాంతానికి వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. అప్పట్లో మహారాష్ట్ర నుంచి వచ్చిన జానీ అనే పులి నిర్మల్, మంచిర్యాల తదితర జిల్లాల్లో తోడుకోసం సంచరించిందని చెబుతారు. ఇప్పుడు ఎస్ 12 కూడా ఆడ తోడు కోసం అడవుల్లో సంచరిస్తున్నట్టు భావిస్తున్నారు. మన ప్రాంతంలో పులులే లేకపోవడంతో వచ్చిన పులి ఎటు వెళ్తుంది అన్నదానిపై ఆసక్తి నెలకొంది. దాని కదలికలకు కెమెరాలకు చిక్కితే గానీ స్పష్టత వచ్చే అవకాశం లేదు. పులి అడుగులు ఉన్న ప్రాంతాల్లో అటవీ అధికారులు ఆధునిక కెమెరాలు ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నారు.

గోకుల్‌తండా అటవీప్రాంతంలో ఆవుపై దాడి

- పులి దాడి చేసిందంటున్న స్థానికులు
- ఘటనాస్థలానికి ఫారెస్ట్ సిబ్బంది
- నేడు స్పష్టత వచ్చే అవకాశం

రామారెడ్డి: మండలంలోని గోకుల్ తండా అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి 7 నుంచి 8గంటల మధ్యలో ఆవుపై పులి దాడి చేసిందని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు వెంటనే ఘటనాస్థలానికి బయల్దేరారు. బదావత్ పూల్యా అనే వ్యక్తి అటవీప్రాంతంలో ఆవులను మేత కోసం తోలుకెళ్లి తిరిగి వస్తుండగా పులి దాడి చేసిందని స్థానికులు అంటున్నారు. ఆవుపై దాడి చేసింది పెద్ద పులినా లేక చిరుతనా అనేదానిపై శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గత ఐదు రోజులుగా స్కూల్ తండా, బట్టతండా, జగదాంబ తండా ప్రాంతాల్లో పులి జాడకోసం కోసం అటవీశాఖ అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా గోకుల్‌తండాలో ఆవుపై దాడి ఘటన కలకలంరేపింది.

ఇద్దరు హోంగార్డులకు ఉత్కృష్ట సేవా పతకాలు

- మరో హోంగార్డుకు అతి ఉత్కృష్ట సేవా..



మారుతి



వసంత్



మల్లిఖార్జున్

కామారెడ్డి క్రైం: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు హోం గార్డులకు కేంద్రం హోం మంత్రిత్వశాఖ ఉత్కృష్ట సేవా పతకాలను ప్రకటించింది. విధుల్లో ఉత్తమ సేవలకుగాను అందించే పతకం.. తమ ప్రాణాలను పణంగాపెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన ముగ్గురు హోంగార్డులకు దక్కిందని ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల క్రితం పిట్లం మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా బ్లూకోల్ట్స్ హోంగార్డు మారుతి వెంటనే చెరువులో దూకి మహిళను రక్షించాడని పేర్కొన్నారు. అలాగే జిల్లా కేంద్రలో పని చేస్తున్న మరో హోంగార్డు వసంత్ కొద్ది రోజుల క్రితం రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ప్రాణాలను సమయస్ఫూర్తితో రక్షించాడని తెలిపారు. వారిద్దరూ ఉత్కృష్ట సేవాపతకాలకు ఎంపికకాగా, ఎలాంటి రిమార్కులు లేకుండా 31 ఏళ్లుగా నిబద్ధతతో పని చేస్తూ ప్రస్తుతం ఎస్బీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న మల్లిఖార్జున్ 'అతి ఉత్కృష్ట' సేవా పతకానికి ఎంపికైనట్లు వెల్లడించారు. ముగ్గురికి పతకాలు దక్కడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. ఉత్తమ సేవలు అందించేవారికిగుర్తింపు లభిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



పద్మాజివాడిలో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ సంగ్వాన్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సదాశివనగర్ మండల కేంద్రంతోపాటు పద్మాజివాడి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. వన మహోత్సవంలో భాగంగా పద్మాజివాడిలో అటవీశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నలుగురు విద్యార్థులను సన్మానించారు. పద్మాజివాడి చౌరస్తా వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలుపగా, హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమ్యూనిటీ హార్వెస్టింగ్‌ను పరిశీలించి అభినందించారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో యోసెఫ్, అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేయండి
- ఆరోగ్యశ్రీ నిధుల వినియోగం, వివరాలు కావాలి
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- 'సాక్షి' కథనంలో ప్రస్తావించిన సమస్యలు, అంశాలపై చర్చ



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) మొదటి సమావేశాన్ని చైర్మన్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. ఆస్పత్రిలోని సమస్యలు, వైద్యసేవలు, అభివృద్ధి ఎజెండా అంశాలపై చర్చించారు. అంతకు ముందు ప్రసూతి విభాగం, రక్తనమూనాల సేకరణ షెడ్డు, మార్చురీ, ఆక్సిజన్ ప్లాంట్‌లను పరిశీలించారు. సూపరింటెండెంట్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని సలహాలు, సూచనలు చేశారు.

రెండున్నర గంటలపాటు సమీక్ష

ఆస్పత్రి అధికారులు, వైద్యులతో కలెక్టర్ రెండున్నర గంటలపాటు సమీక్షించారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు హెచ్‌డీఎస్ నిధులు రూ.2 లక్షలతో పాత ట్యాంక్‌లకు మరమ్మతులు చేయించాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా తాగు నీటిని సరఫరా చేయాలని, అవసరమైతే మున్సిపల్ నుంచి నీటిని సరఫరా చేయాలని కమిషనర్ రాజేంద్‌రెడ్డికి సూచించారు. ఆరోగ్యశ్రీ నిధుల అక్రమాలపై అధికారులను నిలదీశారు. నిధుల వినియోగం, వివరాలపై విచారణ జరిపి వారంలోపు నివేదిక ఇవ్వాలని స్థానిక సంస్థల కలెక్టర్ చందర్‌నాయక్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కేసులు సంఖ్య ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. ఓపీ రోగుల రిజిస్ట్రేషన్ ప్రదేశం ఇరుకుగా ఉందని, ప్రత్యేకంగా షెడ్డు నిర్మించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌డీపీ యంత్రం పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడే అన్ని రకాల పరీక్షలు చేయాలని, ప్రైవేట్‌లకు వెళ్తున్నామని ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని వైద్యుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంలోని అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఆస్పత్రిలో నీటి సమస్య, ఓపీ సేవలు, రక్తనమూనాల సేకరణ, రక్తపరీక్షలు, ఆరోగ్యశ్రీ నిధులు వినియోగం, అక్రమాలు, లిఫ్ట్ తదితర సమస్యలపై చర్చించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేకర్, ఆర్ఎంవోలు రవీందర్, హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు, హెడ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌డీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఎంపీ, ఎమ్మెల్యేల గైర్హాజరు

జీజీహెచ్ ఏర్పడిన తర్వాత మొదటి సారిగా నిర్వహించిన హెచ్‌డీఎస్ సమావేశానికి ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు గైర్హాజర్యారు. ఎమ్మెల్యేలు హాజరై సమస్యలపై మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తే బాగుండేదని పలువురు పేర్కొన్నారు.

వేల్పూర్‌లో ఉద్రిక్తత

- బల ప్రదర్శనకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల పోటాపోటీ
- పలువురు నాయకులు, కార్యకర్తల అరెస్టు



దేవేందర్‌రెడ్డిపై దాడి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్/వేల్పూర్ : 'కనువిప్పు' పేరిట కాంగ్రెస్, పరిచయం పేరిట బీఆర్ఎస్ పార్టీలు గురువారం చేపట్టిన కార్యక్రమాలు వేల్పూర్‌లో ఉద్రిక్తతకు దారి తీశాయి. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు బల ప్రదర్శనకు సిద్ధం కావడంతో పోలీసులు 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలు చేస్తూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో వేల్పూర్ మండల కేంద్రం వేడెక్కింది. గల్ఫ్ వలస కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను ప్రశాంత్‌రెడ్డికి ఇంటికి తీసుకువస్తామని ప్రకటించారు. మానాల ప్రకటనకు స్పందించిన బీఆర్ఎస్ నాయకులు లబ్ధి పొందని వారితో వేల్పూర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతామని వెల్లడించారు.

నాయకులను బయటకు పంపిన పోలీసులు

వేల్పూర్‌లో బల ప్రదర్శన కోసం వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బయటకు పంపించారు. వేల్పూర్‌లో ఉంటే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి ఒక్కరే పోలీసుల కళ్లుగప్పి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లారు. దీనిని గుర్తించిన బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తమ ఎమ్మెల్యే ఇంటికి ఎలా వస్తారని ప్రశ్నిస్తూ దేవేందర్‌రెడ్డిని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొందరు నాయకు లు ఆయనపై దాడి చేసి చొక్కా చింపారు. పోలీసులు కలుగజేసుకొని ఆయన్ని స్టేషన్‌కు తరలించారు. అంతకుముందే మానాల మోహన్‌రెడ్డిని నిజామాబాద్‌లోనే గృహ నిర్బంధం చేయగా, సునీల్‌రెడ్డిని మోర్తాడ్ ప్రజానిలయం నుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు.

ఆస్పత్రి దేవాలయంతో సమానం

- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రి దేవాలయంతో సమానమని, ఇక్కడి వైద్యులే పేదల ప్రాణాలు కాపాడే దేవుళ్లని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని ప్రభుత్వ ఏరియా, మాతాశిశు ఆస్పత్రులను గురువారం ఆయన తనిఖీ చేశారు. వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్యసేవలు, వసతులపై ఆరాతీశారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి, సలహాసంఘం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సుమారు 230 పడకల స్థాయిలో ఉన్న ఆస్పత్రిలో పోలీస్ అవుట్‌పోస్టు అవసరాన్ని గుర్తించామని, త్వరలో జిల్లా ఎస్పీతో మాట్లాడి పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆస్పత్రికి అనుబంధంగా హెల్త్ కమిషనర్‌తో మాట్లాడి మరో అంబులెన్స్‌ను తెప్పించుకుందామన్నారు. అత్యవసరమైతే తప్ప రోగులను నిజామాబాద్‌కు రిఫర్ చేయొద్దని సూచించారు. తెలంగాణ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు కృష్ణారెడ్డి, మహ్మద్ ఎజాస్, అలీమొద్దీన్ బాబా, గురువినయ్, మాలెపు నారాయణరెడ్డి, నార్ల రవీందర్, అబ్దుల్ ఖాలేఖ్, శివదయాల్‌వర్మ, హమీమ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న పోచారం

క్లుప్తంగా

27న గిరిజన గర్జన సభ



కామారెడ్డి టౌన్: గాంధారీ మండల కేంద్రంలో మారుతీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 27న గిరిజన గర్జన సభ నిర్వహిస్తున్నట్లు లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సునావత్ గణేష్ నాయక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వివరించారు. ధర్మ సమాజ్ పరిరక్షణ, పోడు, అసైన్‌మెంట్ భూములుపై అవగాహన కల్పించడం, గిరిజనుల గోరు బోలి భాష భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అంశాలపై ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇళ్ల నిర్మాణాల నిలిపివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని పోలీస్‌స్టేషన్ పక్కనున్న సర్వే నం.498లో గల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను నిలిపివేసినట్లు స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. నిరంతరం పర్యవేక్షణ జరిపి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఆయన కార్యదర్శి కిష్టయ్యను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌ఐ మహ్మద్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు ఉన్నారు.

పీఏఐ అవార్డుల కోసం డాటా ఎంట్రీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పీఏఐ(పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌డెక్స్) అవార్డుల కోసం పంచాయతీ కార్యదర్శులు డాటా ఎంట్రీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గురువారం డాటా ఎంట్రీ ప్రక్రియపై పవర్ ప్రజేంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ పరిధిలోని వివిధ శాఖలకు సంబంధించి 147 ప్రశ్నలుంటాయన్నారు. వాటన్నింటికీ సంబంధించిన సమాచారాన్ని సేకరించి డాటా ఎంట్రీ చేయాలని చెప్పారు. ఎంపీడీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

కర్షక్ బీఎడ్ కళాశాల విద్యార్థులకు ఐదు పతకాలు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాల విద్యార్థులు 2017 నుంచి 2021 వరకు వరుసగా ఐదేళ్ల టాపర్లుగా నిలిచి తెలంగాణ విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకోవడం కళాశాల గౌరవాన్ని మరింత పెంచిదని కళాశాల ప్రిన్సిపల్ ఎంఏ రషీద్ అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో బంగారు పతకాలు పొందిన విద్యార్థులు, అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ధర్మారెడ్డి శివారులోగల పేకాట స్థావరంపై గురువారం ఎస్సై భార్గవ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న ముగ్గురిని పట్టుకోగా, మరికొందరు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, 9 బైక్‌లతోపాటు రూ.8,903 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

రైతన్నా.. విష సర్పాలతో జాగత్త్ర!

- కాటు వేస్తే మంత్రగాళ్ల వద్దకు కాకుండా సమీప ఆస్పత్రికి వెళ్లాలి
- అప్రమత్తతే రక్ష అంటున్న వైద్యులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): వర్షాకాలంలో పాములు, ఇతర విష పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా ఉదయం లేచి వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఈ బాధలు తప్పవు. వీరు ఉదయం పూట గెట్ల వెంబడి చూసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. మరో వైపు గ్రామాలకు దూరంగా ఉండే వసతి గృహాలు, గురుకులాల్లో చదివే విద్యార్థులకు విష సర్పాలతో ప్రమాదం పొంచి ఉంది. పాము కాటుకు గురైన వారికి సకాలంలో చికిత్స అందించకపోతే విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

రైతులు పంట చేలకు వెళ్తున్నప్పుడు పాదరక్షలు వేసుకోవాలి. రాత్రి పూట, తెల్లవారుజామున పొలాలకు వెళ్లేటప్పుడు టార్చిలైట్లు వెంట తీసుకెళ్లాలి. పశుగ్రాసం, గడ్డి వాములు, చెత్త కుప్పలు, కట్టెలు, దుంగలు రాళ్ల కుప్పలు ఉన్న చోట పాములు ఎక్కువగా తిరుగుతుంటాయి. చేతిలో కర్ర పట్టుకుని శబ్దం చేసుకుంటూ ముందుకు సాగాలి. మోటార్లు, స్టార్టర్ల డబ్బాలోను సర్పాలు సేద తీరుతుంటాయి. వాటి తలుపులు తీసే క్రమంలో జాగ్రతగా పరిశీలించాలి. ఇంటి ఆవరణలో సైతం చెత్తను పోగు చేసుకోకూడదు. ముళ్ల పొదలు, గడ్డిని తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

లక్షణాలు..

విష సర్పం కాటు వేస్తే కోరల గాయం కనిపిస్తుంది. నొప్పి తీవ్రంగా ఉంటుంది. విషం క్రమంగా శరీరమంతా వ్యాపిస్తుంది. నాలుక మందమవుతుంది. గొంతు కండరాలు బిగుసుకుంటాయి. చొంగ కారడంతో పాటు కళ్లు కనిపించకపోవడం, శరీరం మొద్దు బారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒక వేళ ఎవరైనా పాము కాటుకు గురైతే వారికి ధైర్యం చెప్పాలి. కాటేసిన చోటుకు కొంత పైభాగంలో కట్టు కట్టాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి. అంతేకాని సంప్రదించకుండా మంత్రగాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ్రయించవద్దు.

సకాలంలో వైద్యమందించాలి

పాము కాటుకు గురైన వ్యక్తిని జాప్యం చేయకుండా సకాలంలో సమీప ఆస్పత్రికి తరలించాలి. వెంటనే వైద్యం అందించాలి. తొందరగా యాంటీ వీనమ్ సీరమ్ ఇంజక్షన్ వేయించాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే అపాయం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు విరుగుడు ఇంజక్షన్‌లు అందబాటులో ఉన్నాయి. – ఆస్మా అఫ్షిన్, ప్రాథమిక కేంద్రం వైద్యురాలు, సదాశివనగర్

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన జిల్లా అధ్యక్షులు విఠల్.. కార్యవర్గ సభ్యులు

ఎల్లారెడ్డి: ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు విఠల్ అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం నిర్వహించిన ముదిరాజ్ సంఘం మండల కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాధికారంలో వాటాయే లక్ష్యంగా పోరాడాలని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షుడిగా కుడుముల సత్యనారాయణ, అధ్యక్షుడిగా ప్యాలాల రాములు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సాయిరాం, ఉపాధ్యక్షులుగా సిద్ది రాములు, అశోక్, బాలయ్య, భాస్కర్, ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా గోనే శ్రీకాంత్, తదితరులను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. నాయకులు సంతోష్, నర్సింలు, బాలకిషన్, సాయిలు తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం..



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్: జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారం గురువారం స్థానిక గోపాలస్వామి రోడ్డులోని శ్రీకాళికామాత ఆలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కంది రఘునాథంచారి, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ నరేష్‌శాస్త్రి, కోశాధికారిగా అల్వాల శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షులుగా కొండ రామచంద్రమాచార్యులు, ఆరూరి శ్రీనివాస్ చారి, కాసాల లింగమాచారి, సహాయ కోశాధికారిగా గడ్డపు రాజేష్‌చారిలు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కారంపూడి కృష్ణామాచారి, ప్రతినిధులు హాజరయ్యారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు, కోతులు

- పక్షం రోజుల్లో 62 మందిని కరిచిన వైనం
- ఇబ్బందులు పడుతున్న జనాలు



ఎల్లారెడ్డి శివారులో సంచరిస్తున్న కుక్కలు



ఎల్లారెడ్డి శివారులో గల కోతుల గుంపు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కోతులు, కుక్కలను చూడగానే జనాల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయి. కోతుల మందను చూసి జనాలు భయాందోళన చెందుతుండగా మరో వైపు కుక్కల గుంపు గుండె గుబేలుమనేలా జడుసుకుంటున్నారు. కోతులను అటవీ ప్రాంతాలకు తరలించేలా, కుక్కలకు వ్యాక్సిన్లు వేసి వాటి సంతానం పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలో గత పక్షం రోజుల వ్యవధిలో 62 మంది కుక్కలు, కోతుల బారిన పడి గాయాల పాలయ్యారు. కుక్కలు కరిచిన వారు 26 మంది ఉండగా, కోతుల బారిన పడి గాయాలపాలైన వారు 36 మంది ఉన్నారు.

గాయపడిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో మొదటి డోసు వ్యాక్సిన్లు వేసుకున్నారు. మండలంలో మూడు, నాలుగు డోసుల వ్యాక్సిన్లు వేసుకున్న వారు మరో 78 మంది ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. మార్కెట్‌లో ఏదైనా వస్తువులను చేతిలో పట్టుకుని పోతే కోతులు దాడి చేసి గాయపరిచి చేతిలోని వస్తువులను లాక్కెళ్తున్నాయని, ఇంటి మీద ఉన్న కూన పెంకలను తీసి ఇళ్లు పీకి పందిరి చేస్తున్నాయని, వర్షానికి ఇంటిపై కప్పిన కవర్లను చించేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పొలానికి వెళ్తుండగా దాడి చేశాయి

వ్యవసాయ పొలానికి వెళ్తున్న సమయంలో కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాను. పరిస్థితి విషమంగా ఉండడంతో కామారెడ్డికి రిఫర్ చేశారు. – అందిగల్ల కాశి, రుద్రారం

ఇంటి పనులు చేస్తుండగా..

ఇంటి పనులు చేస్తున్న సమయంలో కోతులు పైన పడి గాయపర్చాయి. దీంతో గాయాలు కావడంతో ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో వ్యాక్సిన్ వేయించుకున్నాను. అధికారులు తగిన చర్యలను తీసుకుని కోతుల బెడదను నివారించాలి. – దుర్గయ్య, బ్రాహ్మణపల్లి

హోటల్‌లో తింటుండగా..

ఎల్లారెడ్డిలో హోటల్‌లో కూర్చుని తింటుండగా కోతులు మీద పడి కరిచాయి. చాలా భయం వేసింది. వెంటనే ఆస్పత్రిలోకి వెళ్లి వ్యాక్సిన్ తీసుకున్నాను. కోతుల బెడద తీవ్రంగా ఉంది. వాటి గురించి తగిన చర్యలు తీసుకోవాలి. – రత్నవ్వ, జల్దిపల్లి, లింగంపేట

రోడ్డుపై వెళ్తుండగా కరిచాయి

రోడ్డుపై వెళ్తున్న సమయంలో కుక్కలు కరిచాయి. రక్త స్రావం కావడంతో ఆస్పత్రిలో వ్యాక్సిన్ వేయించుకున్నాను. గ్రామాలలో కుక్కల బెడద బాగా ఉంది. దీని గురించి అధికారులు తగిన చర్యలను తీసుకోవాలి. – సాయిలు, సాతెల్లి

క్రైం కార్నర్

మూర్ఛ వ్యాధితో గుర్తుతెలియని వ్యక్తి మృతి



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కంఠం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మూర్ఛవ్యాధితో మృతి చెందాడు. వివరాలు ఇలా.. గ్రామంలో గురువారం సుమారు 25ఏళ్ల నుంచి 30ఏళ్ల వయస్సు ఉన్న ఓ వ్యక్తి కత్తెరలు సానబెట్టేందుకు వచ్చాడు. ఇంటింటికీ తిరుగుతూ కత్తెరలు సానబెడుతుండగా అకస్మాత్తుగా మూర్ఛవ్యాధి వచ్చి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మోపాల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గుండ్యానాయక్ తండాకు చెందిన ప్రకాశ్ (40) గతంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి వచ్చాడు. కొన్నిరోజులుగా అతడి ఇంట్లో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈక్రమంలో ఇటీవల ప్రకాశ్ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించి ప్రకాశ్ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో మహిళ ఆత్మహత్య



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారంనగర్ కాలనీలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే శశికళ(40) గతంలో గంధం శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద రూ. 15వేలు అప్పు తీసుకుంది. ఇప్పటి వరకు 36వేలు వడ్డీ కట్టినప్పటికీ ఇంకా అసలు ఇవ్వాలని వేధించాడు. దీంతో ఈ బాధ భరించలేక బుధవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు యోగేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

హోటల్ యజమానిపై కేసు నమోదు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని భీమవరం రుచులు హోటల్ యజమాని విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలకేంద్రంలోని భీమవరం రుచులు హోటల్‌పై బుధవారం ముస్కాన్ టీం ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ ఆఫీసర్ పల్నాటీ యోహాన్ తనిఖీలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా 15 సంవత్సరాల బాలుడు హోటల్‌లో పని చేస్తునట్లు గుర్తించారు. లేబర్ ఆఫీసర్ యోహాన్ ఫిర్యాదు మేరకు హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్య పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సమన్వయకర్త సుధాకర్ కోరారు. వివరాలకు 94403 56276, 91823 04067 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రతిభ అవార్డులకు..

కామారెడ్డి అర్బన్: పదోతరగతి, ఇంటర్‌లో 80శాతానికి కన్నా ఎక్కువ మార్కులు సాధించిన మున్నూరుకాపు విద్యార్థులకు మున్నూరుకాపు మహాసభ కాచిగూడ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డులు అందజేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు పటేల్, పి అంజయ్య పటేల్ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94416 31943 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎంబీసీలకు ఉచిత నైపుణ్య శిక్షణ..

కామారెడ్డి అర్బన్: అత్యంత వెనుకబడిన తరగతులు (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్) అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీయువకులకు వివిధ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై హైదరాబాద్‌లో శిక్షణ పొందేందుకు ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమాధికారి సయ్యద్ రఫీక్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం గుర్తించిన 36 ఎంబీసీ కులాలవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులను 24వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ ఉచిత కోచింగ్‌కు..

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ -1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పోస్టుల కోసం ఉచిత ఫౌండేషన్ కోచింగ్ ప్రోగ్రాం వచ్చే నెల 25 నుంచి 150 రోజులపాటు ఉంటుందని బీసీ సంక్షేమాధికారి సయ్యద్ రఫీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బీసీ అభ్యర్థులు ఆగస్టు 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 08462-241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అడ్మిషన్ల కోసం స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలి



నాగిరెడ్డిపేట కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డ్ ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం అధ్యాపకులు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఇంటర్ బోర్డ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న సూచించారు. నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డీఐఈవో షేక్‌సలాంతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 31వరకు గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్ చేపట్టి కళాశాల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. ఇటీవల పదోతరగతి పాసైన విద్యార్థుల వివరాలను సేకరించాలని, వారి ఇళ్లకు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో కల్పించే సదుపాయాలను గురించి వివరించాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న, నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. వారు గురువారం తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టడీమెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపల్ యూసుఫ్ హుస్సేన్, అధ్యాపకులు సంతోష్, వీరేశం, మల్లేషం, శ్రీకాంత్, సతీష్,సంరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత అటవీ భూమి స్వాధీనం



పోలీసుల సహకారంతో అటవీభూమిని స్వాధీనం చేసుకుంటున్న అటవీ శాఖ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని లక్ష్మాపూర్ అటవీ ప్రాంతంలో ఆక్రమించుకున్న అటవీభూమిని అధికారులు పోలీసు పహారా మధ్య గురువారం స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మాపూర్ అటవీ భూమిని కొంతమంది కబ్జా చేసి వరి నాట్లు వేశారన్న సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది పోలీసు బలగాల సహకారంతో అటవీ శాఖకు చెందిన భూమిలో వరి నాట్లను జేసీబీలతో తొలగించి, కందకాలు తవ్వారు. తమ భూమిని అటవీశాఖ అధికారులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని పలువురు రైతులు బోరుమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రామారెడ్డి విద్యార్థినుల సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామారెడ్డి: క్రీడా గ్రామంగా పేరుగాంచిన రామారెడ్డికి చెందిన బాలికలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మరోసారి సత్తా చాటారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీల్లో రామారెడ్డి బాలికల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు తేజశ్రీ , వైష్ణవి పాల్గొని జట్టును ప్రథమ స్థానంలో నిలిపినట్లు బాలికల పాఠశాల హెచ్‌ఎం సురేష్ బాబు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయులు మురళి కృష్ణ, శ్రీనివాస్, లింగపురం బాలరాజ్, పీఈటీ లింగం తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు



మాట్లాడుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలను తప్పుదోవ పట్టిస్తూ అసోసియేషన్ ఎన్నికలు ఉన్నాయని ప్రచారం చేయడాన్ని నమ్మవద్దని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు కోరారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోలీసు రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య, తదితరులు మాట్లాడారు. ఇప్పట్లో జిల్లా కమిటీ ఎన్నికలు లేవని, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. నేతలు పి. రాధాకిషన్, సీహెచ్ రాజయ్య, ఎం.కృష్ణ, టి.శంకర్, తోట నర్సింలు, భూమయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిట్టపులి దాడిలో లేగదూడ మృతి



లేగదూడను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

సిరికొండ: పాకాల శివారులో జిట్ట పులి (లియోపార్డ్) దాడిలో లేగ దూడ మృతి చెందినట్లు అటవీశాఖ అధికారి సాయికిరణ్ తెలిపారు. మృతి చెందిన లేగ దూడ పాకాలకి చెందిన తేజావత్ బాబుకు చెందినదన్నారు. ఉమ్మడి జిల్లా అడవుల్లో పెద్దపులి సంచారం నేపథ్యంలో ఘటన స్థలాన్ని డీఎఫ్‌వో నిఖిత, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, యానిమల్ ట్రాకర్స్, రేంజ్ సిబ్బంది సందర్శించారు. లేగ దూడను పెద్దపులి కాదని జిట్ట పులి చంపినట్లు నిర్ధారించారు. లేగ దూడ కళేబరానికి పశు వైద్య శాఖ అసిస్టెంట్ సర్జన్ పోస్టు మార్టం చేశారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం పాడి రైతుకు అటవీ శాఖ ద్వారా నష్ట పరిహారం చెల్లిస్తామని డీఎఫ్‌వో తెలిపారు. ప్రజలు అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్లవద్దని ఆమె సూచించారు. పశువుల కాపరులు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపే అడవిలోకి కొద్ది దూరం మాత్రమే వెళ్లి తిరిగి రావాలన్నారు. పొలాల్లో పనులకు వెళ్లేటప్పుడు గుంపులుగా, పెద్ద శబ్దాలు చేస్తు వెళ్లాలన్నారు. ఎవరైనా ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గాని వన్యప్రాణులకు ప్రాణహాని కలిగించినచో కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

మేకల కొట్టంపై చిరుత పులి దాడి



జానకంపేట గ్రామ శివారులో చిరుతపులి ఆనవాళ్లను అన్వేషిస్తున్న అటవీశాఖ అధికారులు

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట శివారులో మేకల కొట్టంపై బుధవారం రాత్రి చిరుత పులి దాడి చేసి ఒక మేకను తీసుకెళ్లింది. వివరాలు .. జానకంపేట గ్రామానికి చెందిన వెల్మలా సందీప్‌కు గ్రామ శివారులోని నవీపేట–బాసర రైల్వేగేట్ అవతల మేకల కొట్టం ఉంది. ఈ కొట్టంలో అతడు మేకలతో పాటు కొన్ని గేదెలను సంరక్షిస్తున్నాడు. కొట్టంపై బుధవారం రాత్రి చిరుత పులి దాడి చేసి ఒక మేకను తీసుకెళ్లింది. వెంటనే ఈ విషయాన్ని అతడు అటవీశాఖ అధికారులకు తెలిపాడు. గురువారం అటవీశాఖ నవీపేట సెక్షన్ బీట్ ఆఫీసర్ సుధీర్ ఘటన స్థలానికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. చిరుత పులిదాడి ఘటన వాస్తవమేనని ధ్రువీకరించారు. ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామ శివారులో మూడు నెలల క్రితం చిరుత పులి సంచరించింది. నవీపేట మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల్లో చిరుత పులుల సంచారం ఉందని జిల్లా అటవీశాఖ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. చిరుత సంచారంతో జానకంపేటతోపాటు పోచారం, దూపల్లి గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వివాహేతర సంబంధం అనుమానంతోనే హత్య

- బిచ్కుందలో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ రవికుమార్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవి కుమార్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ఊరడమ్మ గల్లిలో అడికే రమేష్‌ను హత్య చేసిన నిందితుడు హుండేవార్ కాశీనాథ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. అడికే రమేష్, హుండేవార్ కాశీనాథ్ ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు అవుతారు. రమేష్ బిచ్కుందలోనే నివాసం ఉంటున్నాడు. కాశీనాథ్ పెద్దదేవాడ గ్రామానికి చెందినవాడు కాగా, ఉపాధి నిమిత్తం భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొన్ని నెలల క్రితం రమేష్ తన చెల్లితో కలిసి హైదరాబాద్‌లో ఉన్న కాశినాథ్ ఇంటికి వెళ్లి, వారం రోజులు ఉన్నాడు. అప్పటి నుంచి తన భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో రమేష్‌తో అక్రమ సంబంధం ఉన్నట్లు భర్త కాశీనాథ్‌కు అనుమానం వచ్చింది. దీంతో అతడు రమేష్‌పై కక్షగట్టి ఈనెల 15న రాత్రి హైదరాబాద్ నుంచి బిచ్కుంద వచ్చాడు. 16న ఉదయం రమేష్ ఇంటికి వెళ్లగా అతడు తలుపు తీయగానే కత్తితో కాశీనాథ్ విక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పరారీలో ఉన్న కాశీనాథ్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్సై మోహన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.